క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

20న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 20న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన



కళా ప్రదర్శన ద్వారా స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పిస్తున్న మిమిక్రీ రాజు తదితరులు

దాబాగార్డెన్స్ : స్వచ్ఛ సర్వేక్షణ్ అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం 49, 50, 51 వార్డుల్లో కళా బృందాలచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో కళాకారుడు వైకే రాజు కళా బృందంచే ప్లాస్టిక్ నిషేధం, చెత్తపై చిత్తశుద్ధి, పరిసరాల పరిశుభ్రత, ఎకో–వైజాగ్ తదితర అంశాలపై వీధి నాటకం, జానపద గీతాలతో కళా ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో ఏఎంవోహెచ్ సునీల్, శానిటరీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పదవీ విరమణ వయస్సు పెంపుతో హర్షం



మంత్రి కొట్టు సత్యనారాయణకు అమ్మవారి ఫొటో అందజేస్తున్న రాంబాబు తదితరులు

దాబాగార్డెన్స్ : ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా దేవాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచిన దృష్ట్యా పలువురు ఉద్యోగులు మంగళవారం దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కనకమహాలక్ష్మి దేవస్థానం ఏఈవో వెంపలి రాంబాబు, వేదపండితులు ముష్టి వేంకటేశ్వర ఘనాపాఠి, పలువురు ఉద్యోగులు అమ్మవారి ఫొటోను జ్ఞాపికగా అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా రాచపోలమాంబ మారువారం

అల్లిపురం : భక్తుల కొంగుబంగారం, 14 గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం, చెరువు గట్టులో వెలసిన రాచపోలమాంబ అమ్మవారి మారువారం పండగ మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పెద్దింటి నుంచి సాంప్రదాయ డప్పు వాయిద్యాలతోను, మహిళల కోలాటం, పులివేషాల మధ్య అల్లిపురం మెయిన్‌రోడ్డు, అమ్మవారి సతకంపట్టు, మార్కెట్‌రోడ్డు, నేరెళ్ల కోనేరు జంక్షన్ మీదుగా చెరువుగట్టులో గల అమ్మవారి ప్రధాన ఆలయానికి తోడ్కొని వచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు.

‘జగనన్న తోడు’తో దీటైన భరోసా



రూ.10 వేల పెట్టుబడితో ఫ్యాన్సీ వ్యాపారం చేసుకుంటున్న వరలక్ష్మి



జగనన్న తోడు పథకంతో సుద్దముక్కల వ్యాపారం చేసుకుంటున్న సత్యవతి

- నియోజకవర్గంలో సుమారు 10 వేల మంది ఖాతాల్లో రూ.10 వేల చొప్పున జమ
- జగనన్న అందజేస్తున్న సాయంతో వ్యాపార రంగంలోకి మహిళలు

జగదాంబ : చిరు వ్యాపారుల జీవితాల్లో ‘జగనన్న తోడు’ ఆనందోత్సాహాలు నింపుతోంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందజేస్తున్న జగనన్న తోడుతో కాల్‌మనీ, వడ్డీ వ్యాపారుల బారి నుంచి చిన్నాచితకా వ్యాపారులు రక్షణ పొందుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు జీవనోపాధిగా మారుతున్నాయి. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలే కాకుండా ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్నారు. ముఖ్యంగా మహిళా సాధికారతకు నవరత్నాలు విడుదల చేశారు. ఇందులో జగనన్న తోడు వారికి చక్కటి ఉపాధినిస్తోంది. జగనన్న తోడుతో మహిళలు ఇంటి గడప దాటకుండానే ఆర్థికంగా నిలదొక్కుకుంటూ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. దక్షిణ జోన్‌లో మొత్తం 10 వేల మందికి పైగా చిరు వ్యాపారులు ఉంటే ఒక్క జీవీఎంసీ 35వ వార్డులోనే 700 మందికి పైగా జగనన్న తోడు పథకం పొందిన మహిళలు తోచిన వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు.

పూర్ణామార్కెట్‌లో 700 మందికి..

ముఖ్యమంత్రి చిరువ్యాపారులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రవేశపెట్టిన జగనన్న తోడు పథకం జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్‌లో 700 మంది లబ్ధిదారులకు అందుతోంది. వారి ఖాతాలో రూ.10 వేల చొప్పున నగదు జమ అయింది. దీంతో వారు ఆనందోత్సవాలు జరుపుకుంటున్నారు.

ఓటు అడగడానికి వచ్చే వారే తప్ప పథకాలు ద్వారా తమను ఆదుకున్న వారు ఎవరూ ఉండేవారు కాదని.. ఇప్పుడు సీఎం జగన్ ఆ పని చేస్తూ తమకు భరోసా కల్పిస్తున్నారని చిరు వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారానికి పెట్టుబడిగా..



గతంలో వ్యాపారానికి పెట్టుబడి కావాలంటే వడ్డీకి అప్పులు తీసుకుని పడరాని పాట్లు పడేవాళ్లం. వచ్చిన డబ్బులు వడ్డీలు చెల్లించడానికే సరిపోయేవి. కానీ మిగిలేది కాదు. కష్టమే మిగిలేది. అటువంటి పరిస్థితిలో జగనన్న తోడు పథకం ద్వారా సీఎం జగన్ అందజేసిన డబ్బుతో సుద్దముక్కల వ్యాపారం చేసుకుంటున్నాను.

– సత్యవతి, సుద్దముక్కల వ్యాపారి, పూర్ణామార్కెట్.

మళ్లీ జగనన్నే రావాలి..



పేదల పెన్నిధి జగనన్న. సొంతంగా వ్యాపారం చేసుకోవడానికి పెట్టుబడి లేని నాకు జగనన్న తోడు ఉపయోగపడింది. వచ్చిన రూ.10 వేలతో పూర్ణామార్కెట్‌లో చిన్న ఫ్యాన్సీ వ్యాపారం చేసుకుంటుంటూ పిల్లల్ని చదివించుకుంటున్నాను. సీఎంగా మళ్లీ జగనన్నే రావాలి.

–వరలక్ష్మి, ఫ్యాన్సీ వ్యాపారి, పూర్ణామార్కెట్.

ప్రతి పథకం ప్రజలకు అందేలా..



ప్రభుత్వం అందజేస్తున్న ప్రతి పథకం అర్హులైన వారికి అందే విధంగా కృషి చేస్తున్నాం. ఇప్పటికీ అర్హులై ఉండి కూడా ఎవరికైనా ఏ పథకమైనా అందకపోతే వెంటనే తెలియజేస్తే వారింటికి సెక్రటరీ వెళ్లి పథకం అందే విధంగా చర్యలు తీసుకుంటారు.

– విల్లూరి భాస్కరరావు, 35వ వార్డు కార్పొరేటర్

జగనన్న సురక్షతో సత్వర న్యాయం

ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



అచ్చియ్యమ్మపేటలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్ తోట పద్మావతి

అల్లిపురం : అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. సంతృప్తి స్థాయిలో పారదర్శకంగా సంక్షేమ పథకాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. మంగళవారం 34వ వార్డు అచ్చియ్యమ్మపేట సచివాలయంలో వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకంలో భాగంగా వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి 1196 సమస్యలను గుర్తించి, 880 పనులు పూర్తి చేశారన్నారు. లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తిగా అందేలా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తుండడంతో ప్రజల్లో జగనన్నపై నమ్మకం ఏర్పడిందన్నారు.

రాష్ట్రంలో ఇప్పటికే అర్హులైన ప్రతి ఒక్కరికి మేలు జరుగుతుందన్నారు. అర్హులైన లబ్ధిదారులు మిగిలిపోకూడదనే ఉద్దేశ్యంతో కుల, మత, వర్గ పార్టీలకు అతీతంగా, లంచాలకు, వివక్షకు తావు లేకుండా నూటికి నూరుశాతం పారదర్శకంగా సంతృప్తి స్థాయిలో సంక్షేమ ఫలాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. జగనన్న సురక్ష క్యాంపుల్లో దాదాపు 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జేసీజే ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, వార్డు నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు, సత్యవతి, వై.రాజు, గరికిన వెంకటేష్, సూరిబాబు, సత్తిరాజు, నరసింగరావు, యల్లయ్యమ్మ, సురపతి దేవి, నాగమణి, వైట్, రవి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

32వ వార్డులో..

అల్లిపురం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో వార్డు నాయకుడు వెన్నపూస శ్రీనివాసరెడ్డి, బోణి దేవా, ఆదివిష్ణు, బొడ్డేడ ప్రసాద్, ఆదివిష్ణు, అదనపు కమిషనర్ సన్యాసిరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ , చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరేష్‌కుమార్, ఎంఆర్‌వో ఆనంద్‌కుమార్, జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఈఈ రమణమూర్తి, ఏసీపీ వినయ్‌ప్రసాద్, ఏపీడీ పుణ్యవతి, సీవో మంగ, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో మెరుగైన వ్యాధి నిరోధక శక్తి



సదస్సులో మాట్లాడుతున్న విశ్రాంత విద్యాధికారి వైజయంతిమాల

దాబాగార్డెన్స్ : పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని, తద్వారా మనిషి ఆరోగ్యంగా ఉండవచ్చని విశ్రాంత విద్యాధికారి డాక్టర్ కె. వైజయంతిమాల అభిప్రాయపడ్డారు. నగరంలోని ఏవీఎన్ కళాశాలలో ఆ కళాశాల ఉమెన్ అసోసియేషన్, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పోషకాహార విలువలపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విటమిన్లు, కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉండే కూరగాయలు, పండ్లను ఆహారంగా తీసుకోవాలన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం రాజయోగ మెడిటేషన్ సెంటర్ ప్రతినిధి బీకే శివజ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ప్రశాంతతకు రాజయోగ, మెడిటేషన్ అభ్యసించాలని, తద్వారా జ్ఞాపకశక్తి పెరుగుతుందని, ఆరోగ్యంగా ఉంటారన్నారు. విద్యార్థులతో రాజయోగ మెడిటేషన్ చేయించారు. బ్లడ్‌డోనర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎస్. రాజకుమారి మాట్లాడుతూ బాలికల్లో రక్తహీనత ఎక్కువగా ఉంటుందని, బెల్లం, చెరకు, ఖర్జూరం, ఐరన్ పదార్థాలు తీసుకోవడం ద్వారా రక్తశాతం పెరుగుతుందని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు మాట్లాడుతూ పాశ్చాత్య దేశాల ఆహారపు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని, మన దేశంలో పండే ఆకుకూరలు, కూరగాయలు, పప్పు దినుసుల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయన్నారు. జంక్‌ఫుడ్స్ తినడం వల్ల యువత ఆరోగ్యం పూర్తిగా దెబ్బ తింటుందన్నారు. సదస్సులో కళాశాల అధ్యాపకులు పి. కృష్ణకుమారి, డాక్టర్ ఎ. అర్చన, పైడి రజని, ఉమెన్ అసోసియేషన్ అధ్యక్షురాలు స్వరాజ్యలక్ష్మి, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్రా స్టాల్ ప్రారంభం



ఫిష్ ఆంధ్రా స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ : యువతకు ఉపాధి కల్పించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పలు కార్యక్రమాలు చేపడుతున్నారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. మంగళవారం జీవీఎంసీ 35వ వార్డు ప్రసాద్‌గార్డెన్స్‌లో కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావుతో కలిసి ఫిష్ ఆంధ్రా స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సబ్సిడీతో జగనన్న ఫిష్ ఆంధ్రా స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో నిరుద్యోగ సమస్య తొలగడంతో పాటు కుటుంబ పోషణ సులభమవుతుందన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్‌లో తెలియజేస్తే ఆయా శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఫిష్ ఆంధ్రా దుకాణదారుడితో మాట్లాడుతూ పారదర్శకంగా వ్యాపారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సంఘటితంగా పోరాడాలి



ఇన్‌చార్జిలను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

దాబాగార్డెన్స్ : బ్రాహ్మణులందరూ సంఘటితంగా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని ఏపీ ప్రైవేట్ అర్చక పురోహిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సతీష్ శర్మ పిలుపునిచ్చారు. నగరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయ సమావేశ మందిరంలో మంగళవారం సంఘం విశాఖ శాఖ తృతీయ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పురోహితులు, అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. భవిష్యత్ ఎన్నికల నేపథ్యంలో పలు రాజకీయ పార్టీల నాయకులతో త్వరలో భేటీ కానున్నట్టు తెలిపారు. సంఘం గౌరవ అధ్యక్షుడు రావూరి సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ ఇన్‌చార్జిలు సమన్వయంతో పనిచేసి సంఘం అభివృద్ధికి సహకరించాలన్నారు. విశాఖ జిల్లా అధ్యక్షుడు సుధీర్‌శర్మ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 25 మంది ఇన్‌చార్జిలు ఉత్సాహంగా పని చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. సంఘానికి ఉత్తమ సేవలందిస్తున్న ఇన్‌చార్జిలను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి అధికార్ల కాళిదాసు, జిల్లా కార్యదర్శి మావుడూరు సంపత్‌కుమార్, సప్త రుషి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మాధవశర్మ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు మహిళా పోలీసులు సహకరించాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ ఎన్ సాయి

మద్రిపాలెం : నేరాలను నియంత్రణకు సచివాలయ మహిళా పోలీసులు సహకరించాలని కంచరపాలెం సీఐ ఎన్.సాయి కోరారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. అనుమానితులు, అపరిచితులు ఎవరైనా సంచరిస్తున్నట్టు గమనించినట్టయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఒంటరిగా వెళ్తున్న మైనర్లను లక్ష్యంగా చేసుకుని నగదును,సెల్‌ఫోన్లు కాజేస్తున్నారని, అలాంటివారిపై నిఘా ఉంచాలని తెలిపారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్లు ఉన్న వారి ఫొటోలు సచివాలయ మహిళా పోలీసులకు అందజేస్తామని, తద్వారా వారి కదలికలను గుర్తించాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐలు సమీర్, రవికిషోర్, దివ్యభారతి పాల్గొన్నారు.

23న ఆర్పీ పట్నాయక్‌తో ముఖాముఖి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నరవ ప్రకాశరావు

సీతంపేట: ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్‌తో ఈనెల 23న విశాఖ పౌరగ్రంథాలయంలో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలు మంగళవారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ తర్వాత ప్రపంచ సినిమా పరిస్థితి అంశంపై ప్రసంగం, ముఖాముఖి కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫిల్మ్ సొసైటీ అధ్యక్షులు ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, బి. చిన్నారావు, బాబ్జి, అర్చన, గాయత్రి, కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

బాలికకు ఆర్థిక సాయం

మురళీనగర్: పేదింటి విద్యార్థినికి మురళీనగర్‌లోని శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ సాయపడింది. కొత్తపాలేనికి చెందిన కె.హిమబిందు పదోతరగతి పాసయ్యింది. ఇంటర్‌లో చేరడానికి సర్టిఫికెట్లు కోసం పాఠశాలకు రూ.18 వేలు చెల్లించాల్సిరావడంతో ఆందోళన చెందింది. ఫీజు చెల్లించలేని పరిస్థితుల్లో కుప్పిలి పుష్ప..చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కుప్పిలి కీర్తిపట్నాయక్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆమె దాతల సాయాన్ని కోరారు. అనంతప్రసాద్, పీటీటీ పట్నాయక్, బి.రామానందం, పి.సతీష్ కుమార్, డాక్టర్ బి.శ్రీనివాస్‌లు రూ.10 వేలను కీర్తిపట్నాయక్ చేతుల మీదుగా విద్యార్థినికి అందజేశారు. కార్యక్రమంలో 89వార్డు శిష్టకరణాల సంఘం అధ్యక్షుడు బి.రామనాథం, ఉపాధ్యక్షుడు ఎం.వెంకటరావు, కార్యదర్శి పి.శేఖర్ పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



జగన్మోహనరావును మర్యాదపూర్వకంగా కలిసిన శ్యామ్‌ప్రసాద్ తదితరులు

దాబాగార్డెన్స్ : ఢిల్లీలోని రాష్ట్రపతిభవన్‌లో ఇటీవల జరిగిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వార్షిక సర్వసభ్య సమావేశంలో పాల్గొని మంగళవారం విశాఖ చేరుకున్న రాష్ట్ర రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్, మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు పి. జగన్మోహనరావు, విశాఖ జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వై. శివనాగేంద్రరెడ్డిని మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్, కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్వీ రమణ మర్యాదపూర్వకంగా కలిశారు. కౌన్సిల్ 24వ వార్షికోత్సవాన్ని ఇటీవల ఘనంగా నిర్వహించినందుకు జాతీయ మానవ హక్కుల కమిషన్ అభినందించిందని శ్యామ్‌ప్రసాద్ వారికి వివరించారు.

షిర్డీసాయినాథుడికి ప్రత్యేక పూజలు



కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం : రైల్వే న్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యానమందిరం ప్రాంగణంలోని నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామిని కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ జి.శ్రీనివాసకుమార్, జీవీకే ప్రియ దంపతులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ కుటుంబానికి వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసకుమార్ దంపతులను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షు డు నూకల శేషగిరిరావు, కమిటీ సభ్యులు సత్కరించి, బాబా ఫొటోను బహుమతిగా అందజేసారు.

సబ్సిడీ టమాటాకు వర్షంలోనూ బారులు



టమాటా విక్రయ కౌంటర్ నుంచి గేటు దాటి గొడుగులు వేసుకుని క్యూలో ఉన్న వినియోగదారులు

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో సబ్సిడీ టమాటాల కోసం వినియోగదారులు బారులు తీరారు. మంగళవారం వర్షాన్ని సైతం లెక్కచేయకండా గొడుగులు వేసుకొని క్యూలో గంటలు తరబడి నిరీక్షించారు. రెండు రోజుల పాటు రైతుబజార్‌లో టమాటాల విక్రయాలు జరపలేదు. మంగళవారం ఉదయం విక్రయాలు జరుపుతున్నట్లు తెలుసుకున్న వినియోగదారులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉదయం నుంచే వర్షంలో గొడుగులు వేసుకుని నిల్చున్నారు. ఈ క్యూ టమాటా విక్రయాల కౌంటర్ నుంచి గేటు దాటి వాహనాల పార్కింగ్ ప్రదేశం వరకు కూడా కొనసాగింది. బుధవారం రైతుబజార్‌కు సెలవు కావడంతో మంగళవారం పెద్ద సంఖ్యలో వినియోగ దారులు సబ్సిడీ టమాటాల కోసం ఇలా క్యూ కట్టారు. ఒక్కరోజులో సుమారు ఐదున్నర మెట్రిక్ టన్నుల టమాటా విక్రయం జరిగినట్లు రైతుబజార్ ఈవో జి.ప్రసాద్ తెలిపారు.

కళాకారుడి సృజన.. ప్రకృతి అనుసృజన



నీటిలో అడుగేయడానికి ఇబ్బంది పడుతున్నట్లు..

ఓ కళాకారుడి చేతి నుంచి జాలువారిన చిత్రం.. అక్కడి నేపథ్యం చూడగానే ఆలోచింపజేసేలా ఉంది. నీటిలో నుంచి వస్తున్న బాలుడు మళ్లీ ఆ నీటిలోనే అడుగేయడానికి ఇబ్బంది పడుతున్నట్టు కన్పిస్తోంది. కురుస్తున్న వర్షానికి ఆ చిత్రం ఎదురుగా ఉన్న పుట్‌పాత్‌పై నీరు చేరి ఉంది. నీటిలో నిలబడి ఉన్న ఆ బాలుడు బయటికి వచ్చి నీటిలో అడుగేయాలా? వద్దా అని ఆలోచిస్తున్న భావన కల్పిస్తోంది.

– జగదాంబ

ప్రభుత్వ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మహారాణిపేట : ప్రభుత్వ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. నాడు–నేడు పథకం ద్వారా హాస్టళ్లను మరింత అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సమితి నాయకులు శేఖర్, సింహాచలం, కిరణ్, కళ్యాణ్, భూమి, వాసవి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

26న ఉద్యమ సన్నాహక సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్ : విద్యుత్ సంస్థలో పని చేస్తున్న పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 26న విజయవాడ మాకినేని బసవపున్నయ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న ఉద్యమ సన్నాహక రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను మంగళవారం సిటు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వేపాడ సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటి వరకు విద్యుత్ శాఖలో ఉన్న జేఏసీ చర్చల పేరిట కాలయాపన చేస్తూ విద్యుత్ కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. పీఆర్సీ గడువు పూర్తయి 15 నెలలు గడచినా ఇంతరవకు ఏ విధమైన వేజ్ అగ్రిమెంట్ జరగలేదన్నారు. ఇంకా పలు సమస్యల పరిష్కారంలో జేఏసీతో తెగ తెంపులు చేసుకుని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. చంద్రశేఖర్, సత్యారావు, చంద్రరావు, కొండలరావు, ఆర్కే ఎస్వీ కుమార్, సాయి, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.